తలకెక్కడం లేదు..

- వాహన చోదకుల్లో రాని మార్పు
- హెల్మెట్ వాడకంపై నిర్లక్ష్య ధోరణి
- బ్రాండెడ్ హెల్మెట్లతోనే ప్రయోజనం



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివాజీ

దెందులూరు: రహదారి ప్రమాదాల సంఖ్యను తగ్గించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు ముమ్మరం చేశాయి. అందులో భాగంగానే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. వాహన రిజిస్ట్రేషన్లకు హెల్మెట్ లింక్ తప్పనిసరి చేసింది. కానీ హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనదారులు లైట్ తీసుకుంటున్నారు. సెక్షన్ 129 ప్రకారం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్న నిబంధనకు అలవాటు పడటం లేదు. అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించినా ఫలితం లేదు. గతంలో ప్రభుత్వం హెల్మెట్ లేకుండా పెట్రోల్ పోయొద్దని బంక్ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఈ విధానం ఎక్కడా అమలు కాలేదు.

కలవరపెడుతున్న రోడ్డు ప్రమాదాలు

పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. ప్రధానంగా హైవే రోడ్ లో జరుగుతున్న ప్రమాదాలు ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. హెల్మెట్ ధరించి ఉంటే గాయాలతో బయటపడే అవకాశం ఉంటుందని రోడ్డు భద్రతా సిబ్బంది అంటున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు మాత్రమే స్పాట్‌లో మృతి చెందుతున్నారు. కేవలం హెల్మెట్ వాడకపోవడం వలన కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయి. ప్రభుత్వం, రవాణా శాఖ, పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా వాహనదారుల నుంచి సహకారం కొరవడుతుందనే మాటలు వినిపిస్తున్నాయి.



హెల్మెట్

నాణ్యత లేని హెల్మెట్లతో ప్రయోజనం శూన్యం

పోలీసుల నుంచి తప్పించుకోవడానికి నాణ్యత లేని హెల్మెట్లను కొనుగోలు చేయడం వలన ప్రయోజనం లేకపోగా ప్రమాదమే అధికమని అధికారులు సూచిస్తున్నారు. ఫుట్ పాత్‌లపై లభించే హెల్మెట్ల వలన ధర తగ్గుతుందని ప్రాణ రక్షణకు కనీస గ్యారంటీ ఉండదని చెబుతున్నారు. చిన్న ప్రమాదాల్లో వాహన చోదకుడు కింద పడితే హెల్మెట్ పగిలి గాయాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి.

విస్తృత ప్రచారం అవసరం

హెల్మెట్ వాడకంపై ప్రచారం పెంచాలి. ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థ ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగం చేసేలా చర్యలు తీసుకోవాలి పాఠశాలలు కళాశాలలో హెల్మెట్లు వాడకంపై విరివిగా అవగాహన కల్పించాలి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



వాహన చోదకులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవు. యువత వాహనాలను నడిపే సమయంలో నిబంధనలు పాటించడం లేదు. మితిమీరిన వేగం నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. యాణికులు, వాహన చోదకులు మోటార్ వాహన చట్టం తెలుసుకొని నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలి. ముఖ్యంగా హెల్మెట్ ధరించాలి.

– రాచమల్లు శివాజీ, ఎస్సై, దెందులూరు

వాటర్ ప్యూరిఫయర్ వితరణ



వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేస్తున్న పరమేష్

గణపవరం: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సురక్షితమైన మంచి నీరు అందించడానికి నిడమర్రు మండల మానవత అధ్యక్షుడు వన్నెంరెడ్డి పరమేష్ రూ.10 వేల విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు. సోమవారం గణపవరంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త షేక్ హసీనాకు అందచేశారు.

సంఘ అభివృద్ధికి కృషి

పెదవేగి: రైతులకు అందుబాటులో ఉంటూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తిసభ్య కమిటీ చైర్మన్ కొనకళ్ల శివమణి అన్నారు. మంగళవారం పెదవేగి మండలం ముండూరు సహకార పరపతి సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ లావాదేవీలు, అభివృద్ధి ప్రణాళికలు, రుణాల వివరాలను కార్యదర్శి ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు

ఉంగుటూరు: నారాయణపురం విశాల పరపతి సహకార సంఘం సొసైటీ రూ.115 కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందని సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మెన్ కడియాల రవి శంకర్ వెల్లడించారు. మంగళవారం నారాయణపురం సొసైటీ వద్ద సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రవిశంకర్ మాట్లాడుతూ 22024–25 సంవత్సరంలో రూ.2.28 కోట్ల లాభం ఆర్జించిందన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. రైతులకు అప్పులు, అడ్వాన్స్‌ల నిమిత్తం రూ.82.01 కోట్లు అందించామన్నారు. సొసైటీ సీఈవో ఎ.రంగ నగేష్ నివేదికను చదివి వినిపించారు. కమిటీ సభ్యులు బొట్టా దుర్గారావు, గౌతు బాలబాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మోక్షం



ప్రసంగాలు చేస్తున్న పాస్టర్ రాజు

దెందులూరు: ప్రతి వ్యక్తి దేవునిపై ఆధ్యాత్మిక చింతనతో జీవిస్తేనే మోక్షం లభిస్తుందని పాస్టర్ ఎస్.రాజు అన్నారు. మంగళవారం ఎస్ఎంఆర్ నగర్ ఎదుట హోలీ గ్రేస్ మందిరంలో ఉపవాస విజ్ఞాపన ఆరాధన పండుగలు నిర్వహించారు. పాస్టర్ రాజు ప్రసంగించారు. దెందులూరుతో పాటు సమీప మండలాల నుంచి వచ్చిన విశ్వాసులకు పాస్టర్ రాజు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న డీసీసీబీ సీఈవో సింహాచలం

భీమడోలు: రైతుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాల పాలక వర్గాలు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా డీసీసీబీ సీఈవో సింహాచలం అన్నారు. భీమడోలు రైతు సేవా సహకారం సంఘం వద్ద మంగళవారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతులు సహకార సంఘాల సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏఎంసీ చైర్మన్ శేషపుగిరి, భీమడోలు సొసైటీ సీఈవో నాగేంద్ర, డైరెక్టర్లు వెజ్జు రాంబాబు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామస్తుల సౌజన్యంతో రహదారి అభివృద్ధి



రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెం సరిపల్లి రోడ్డు అధ్వానంగా ఉండడంతో గ్రామస్తుల సౌజన్యంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన రోడ్డు పనులను మంగళవారం పొక్లెయినర్లతో ప్రారంభించారు. గ్రామస్తులు సమకూర్చిన రూ.1,50,000 నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళ్లడానికి ప్రజలు పడుతున్న ఇబ్బందులతో పాటు, దసరా రోజున మహిళా భక్తులు పది వేల మందికి పైగా బోనాలతో ర్యాలీ చేపట్టడానికి అనువుగా రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చింతలపూడి: నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఆర్‌వీఎస్ నారాయణ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు తుర్లపాటి బాబు మాట్లాడుతూ చింతలపూడి మేజర్ పంచాయతీ స్థాయి నుంచి నగర పంచాయతీగా మార్పు చెందినా కార్మికులకు జీతాలు చెల్లించకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు వి.పద్మ,నాగమణి, వంశీ, చిన్నయ్య, రాజి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై మెటల్‌తో ప్రమాదాలు



వంతెన వద్ద ప్రమాదకరంగా మారిన మెటల్

భీమడోలు: జాతీయ రహదారిని ఆనుకుని గుండుగొలను గోదావరి కాలువపై నిర్మించిన వంతెన వద్ద పరిచిన చిన్న మెటల్, రాళ్లు సర్దకపోవడంతో ప్రమాదానికి నెలవుగా మారాయి. వంతెన అంచుల వెంబడి ఎక్కే తరుణంలోనూ, గ్రామం నుంచి రోడ్డు పైకి వచ్చే సమయంలో ద్విచక్ర వాహనదారులు జారి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్య రాత్రి వేళల్లో మరింత ఎక్కువగా ఉండడంతో వాహనదారులు భయపడిపోతున్నారు. వాస్తవానికి ఈ వంతెన నిర్మాణాన్ని తుది దశలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చొరవతో పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో వంతెనకు ఇరువైపులా రోడ్డు పటిష్టత కోసం అంచుల వెంబడి వేసిన చిన్న మెటల్‌ను సర్దకపోవడంతో తరుచూ వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వంతెనపై నుంచి భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, ఇతర ప్రాంతాలకు ప్రతి రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించడంతో అదమరిస్తే ప్రమాదం పొంచి ఉంటుందని వాపోతున్నారు. ఈ రోడ్డుపై ఏదైనా వాహనం జారితే వెనుక నుంచి వచ్చే భారీ వాహనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెనకు ఇరువైపులా పక్కా రోడ్డు వేయాలని వారు కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఆ మెటల్ సర్ది, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భవానీలకు అల్పాహారం అందజేత



భవానీలకు ఆహారం అందజేస్తున్న దాతలు

దెందులూరు: జాతీయ రహదారి గుండుగొలను సింగవరం వద్ద గుండుగొలను గ్రామానికి చెందిన దాత ఇందుకూరి లక్ష్మీపతిరాజు, కుమారుడు రాము, సోమన్ వెంకటరావు ఆధ్వర్యంలో విజయవాడ ఇంద్రకీలాద్రికి దసరా సందర్భంగా మాలధరించి పాదయాత్రగా వెళుతున్న భవానీలకు 16 రకాల అల్పారాలతో పాటు భోజనం, తాగునీరు, మజ్జిగ అందించారు. కార్యక్రమంలో దాట్ల సీతారామరాజు, శ్రీనివాసరాజు, పట్నాల ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భవానీ భక్తులకు భోజనాలు ఏర్పాటు

ఉంగుటూరు: భవానీ భక్తులకు సర్పంచి బండారు సింధు మదుబాబు భోజనాలు ఏర్పాటు చేశారు. మంగళవారం జాతీయ రహదారి మీదుగా కాలినడక భక్తులు భోజనాలు చేశారు. ఈ ఏడాది గతం కంటే ఎక్కువగా కాలినడకన భక్తులు వెళుతుండటం విశేషం. ఇది గమనించిన సర్పంచి బింధు భోజనాలు ఏర్పాటు చేయడాన్ని భక్తులు అభినందిస్తున్నారు.

రాజకీయాలు ఆదర్శవంతంగా ఉండాలి

- డిజిటల్ బుక్ వాల్ పోస్టర్ ఆవిష్కరణలో నేతల వెల్లడి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సూచన మేరకు అశోక్ నగర్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ వాల్ పోస్టర్లను వైఎస్సార్ సీపీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ మాట్లాడుతూ రాజకీయాలు ఆదర్శవంతంగా స్ఫూర్తిదాయకంగా చేయాలే తప్ప కక్షపూరితంగా అభివృద్ధికి విఘాతంగా ఉండకూడదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఐదు సంవత్సరాలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేశారన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యేగా కొఠారు అబ్బయ్య చౌదరి విజయం తథ్యమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరిగితే డిజిటల్ బుక్‌లో తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ 16 నెలల కూటమి పాలనలో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు ప్రజలు గమనిస్తున్నారన్నారు. గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కట్టా ఏసుబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు మేక లక్ష్మణరావు మాట్లాడుతూ పార్టీ అన్ని విభాగాల నాయకులు కార్యకర్తలు అభిమానులకు డిజిటల్ బుక్ రక్షణగా నిలుస్తుందన్నారు. ఏలూరు జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, జడ్పీటీసీలు నిట్టా లీలా నవకాంతం, మండల సరస్వతి కొండలరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గంగరాజు, బండ్ల విజయకుమార్, జిల్లా కార్యదర్శి మట్ట రవి శంకర్ గౌడ్, వైఎస్సార్ సీపీ నాయకులు భక్తుల రత్నకుమారి, తేజ, బాపనయ్య, బత్తుల ఏసురాజు, కొరపాటి ప్రభుదేవా, తలారి రామకృష్ణ, పులవర్తి దేవానంద్, ముని, గారపాటి నాగేశ్వరరావు, గంట పండు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

దెందులూరు: గోపన్న పాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో బుధవారం వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి, వస్తారని వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు తెలిపారు. ఎమ్మెల్యే అధ్యక్షతన సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్ ఎట్ ది రేట్ ఆఫ్ వ్యవసాయంపై రైతుల ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్ పాల్గొంటారని తెలిపారు.

చెరువును తలపిస్తున్న రహదారి



రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

చింతలపూడి: ఇటీవల కురిసిన వర్షాలకు చింతలపూడి మండలంలోని పలు ఆర్ అండ్‌బీ, పంచాయతీ రహదారులు ధ్వంసమయ్యాయి. చింతలపూడి, సత్తుపల్లి, చింతలపూడి, గురుభట్లగూడెం ప్రధాన రహదారులు పలుచోట్ల గోతులు పడి పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో గ్రామీణ రహదారులు దెబ్బతిన్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతి ఏటా వర్షా కాలంలో రోడ్లు దెబ్బతినడం, వాటిని తూతూ మంత్రంగా మరమ్మతులు చేయడం పరిపాటిగా మారింది. దీంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్లు వేసిన కొద్ది కాలానికే కొట్టుకుపోతున్నాయి. రోడ్ల నిర్మాణ సమయంలో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడం కారణంగా వేసిన కొద్ది కాలానికే శిథిలమవుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. దీంతో ఏటా మరమ్మతుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షం పడిందంటే రోడ్లు మురికి గుంటలుగా మారుతున్నాయి. వర్షపు నీటితో నిండిన గుంతలు కనపడక వాహనదారులు వీటి బారిన పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మధ్య తెలంగాణ నుంచి భారీ వాహనాలు తిరుగుతుండటంతో అధిక బరువు వలన కోట్లాది రూపాయలతో నిర్మించిన రహదారులు పాడవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు మార్జిన్లు ఆక్రమణకు గురవ్వడంతో సరైన డ్రెయినేజీ సౌకర్యాలు లేక వర్షపు నీటితో పాటు ఇళ్లలో వాడుకున్న నీరు రోడ్లపైకి చేరి తటాకాలను తలపిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణం రహదారుల మరమ్మతులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 1వ తేదీన ఆర్‌డీఎస్‌ఎస్ పనులు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శక్తి స్వరూపిణీ.. కరుణించమ్మా!



గుండుగొలనులో శ్రీదుర్గాదేవిగా శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి



ఎంఎంపురంలో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



గణపవరం: దుర్గాదేవికి పూజలు చేస్తున్న మహిళలు



నిడమర్రు: సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



దెందులూరు: దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



ఉంగుటూరు: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

- దుర్గాదేవి అవతారంలో అమ్మవారి దర్శనం

భీమడోలు: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన మంగళవారం దుర్గాష్టమి అమ్మవారు దుర్గాదేవిగా ఆలయాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు భక్తులకు శక్తిని, ధైర్యాన్ని, రక్షణగా అమ్మ అభయం అందించే శక్తి స్వరూపిణిగా పూజలందుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, కురెళ్లగూడెం, నరెడ్లగూడెం తదితర గ్రామాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు విశేష పూజలు చేశారు. గుండుగొలనులో శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీదుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు లంకా శివకుమార్ శర్మ, లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మంగళవారం రాత్రి ఎంఎంపురంలోని భవానమ్మను ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాజకీయ అడ్వైజరీ కమిటీ సభ్యుడు పుప్పాల వాసుబాబు దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. నరెడ్లగూడెంలోని గద్దెపై వేంచేసియున్న అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఆలయ పూజారి వర్ధినేడి కపిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కురెళ్లగూడెంలో అమ్మవారిని బంతి పూలు, తమలపాకులతో అలంకరించారు.

ఘనంగా దసరా మహోత్సవాలు

దెందులూరు: వాడవాడలా దసరా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం గోపన్నపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోతునూరు, జోగన్నపాలెం, కొవ్వలి, సీతంపేట, చల్ల చింతలపూడి, శ్రీరామవరం గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

అమ్మవారికి కుంకుమ పూజలు

ఉంగుటూరు: మండలంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. నారాయణపురం వంతెన వద్ద కనకదుర్గమ్మకు కుంకమ పూజలు నిర్వహిస్తున్నారు. ఉంగుటూరులో భీమేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద, చల్లాలమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్నారు. చిన్న వెల్లమిల్లి, వెల్లమిల్లి, యర్రమళ్ల, బాదంపూడి, నాచుగుంట, బొమ్మిడి, ఉప్పాకపాడు, చేబ్రోలు, కైకరం, ఎ.గోకవరం, గొల్లగూడెం, రాచూరు తదితర గ్రామాల్లో దేవీనవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

పాహిమాం.. దుర్గామాతా

నిడమర్రు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద నిండ్రకొలను, నిడమర్రు, పత్తేపురం, మందలపర్రు గ్రామాల్లోని ఆలయాలు, వేదికల వద్ద అమ్మవారు శ్రీదుర్గ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బువ్వనపల్లి గ్రామ దేవత శ్రీవడలమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

దుర్గాదేవిగా కనకదుర్గమ్మ

గణపవరం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శమిచారు. మండలంలోని పలు గ్రామాలలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. గణపవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వరంలో కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ భవనంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీమాతకు ప్రత్యేక అలంకరణ చేశారు. చిన రామచంద్రపురం కనకదుర్గమ్మను దుర్గాదేవిగా అలంకరించారు. బాలయ్య చెరువు వద్ద కంచి కామాక్షి కనకదుర్గమ్మ ఆలయం, బస్టాండు వద్ద సలాదివారి వీధి, పిప్పర కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ చేశారు.